# ఆధునిక భారతదేశ చరిత్ర

## సమరశీల జాతీయవాదం

భారత జాతీయోద్యమంలో మితవాదులు, అతివాదులు, గాంధేయవాదులు నిర్వహించిన ఉద్యమాలతో పాటుగా సమరశీల జాతీయవాదం లేదా విప్లవవాదుల ఉద్యమం కూడా ప్రాధాన్యం పొందింది. మితవాదులు ప్రార్థన, విజ్ఞప్తి, నిరసన లాంటి పద్ధతులను పాటించగా, అతివాదులు 'స్వరాజ్యం మా జన్మహక్కు, దాన్ని సాధించి తీరుతాం' అని ఉద్యమాలు చేశారు. గాంధీ సత్యం, అహింస, సత్యాగ్రహం సిద్ధాంతాల ద్వారా స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించారు. యువకులైన కొంతమంది విప్లవ వాదులు రహస్య సంఘాల స్థాపన, కరపత్రాల ప్రచురణ, ఆయుధాల తయారీ, నిధుల సమీకరణ లాంటి చర్యల ద్వారా ఆంగ్లేయులను భయభ్రాంతులకు గురి చేసి దేశాన్ని వీడేలా చేశారు. అనేక ఉద్యమాల్లో భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, ఉద్దమ్ సింగ్ లాంటి వీరులు పాల్గొన్నారు.

సాయుధ విప్లవం ద్వారా బ్రిటిషర్లను భారతదేశం నుంచి తరిమేయాలని కొందరు యువకులు, ఉద్యమకారులు భావించారు. వారు రహస్య సంఘాలుగా ఏర్పడి, కరపత్రాల ద్వారా తమ భావాలను ప్రచారం చేస్తూ, ఆయుధాలు సమకూర్చుకుని ఆంగ్లేయులపై భౌతిక దాడులు చేసేవారు. నిధుల సమీకరణ, ఆయుధాల సేకరణ కోసం ప్రభుత్వ ఖజానాలు, రైళ్లపై దాడులు చేసేవారు. మహారాష్ట్ర, పశ్చిమ్ బంగా, పంజాబ్ ప్రాంతాలతో పాటు విదేశాల్లో కూడా విప్లవవాదులు హింసాత్మక చర్యలకు దిగారు. ఐర్లాండ్/ ఐరిష్ తీవ్రవాదులు, రష్యన్ శూన్యవాదులు భారతీయ యువకులను ప్రభావితం చేశారు.

మొదటి విప్లవ సంఘటన మహారాష్ట్రలో చోటు చేసుకుంది. 1897లో దామోదర్ చాపేకర్, బాలకృష్ణ చాపేకర్‌లు (చాపేకర్ సోదరులు) రాండ్, ఐరిస్ట్ అనే ఇద్దరు ఆంగ్ల ఉద్యోగులను హతమార్చారు. ఈ సంఘటనతో బ్రిటిష్ ప్రభుత్వం చాపేకర్ సోదరులను ఉరితీసింది. భారతదేశంలో తొలి విప్లవోద్యమానికి స్ఫూర్తిప్రదాత, సిద్ధాంతకర్త అరవిందోఘోష్. వాస్తవంగా 1876లోనే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాసుదేవ్ బలవంత్ ఫాడ్కే సాయుధ తిరుగుబాటు చేశాడు. సావర్కర్ సోదరులు (గణేష్ సావర్కర్, వినాయక దామోదర్ సావర్కర్) 1899లో మిత్రమేళా, 1904లో అభినవ భారత్ అనే రహస్య విప్లవ సంఘాల్ని స్థాపించారు. బరీంద్రకుమార్ ఘోష్, జతీంద్రనాథ్ బెనర్జీ, ప్రమోద్ మిత్తర్‌లు కోల్‌కతాలో 'అనుశీలన్ సమితి' సంఘాన్ని; పులిన్‌దాస్ 'ఢాకా అనుశీలన్ సమితి'ని స్థాపించారు. 1924లో కాన్పూర్‌లో సచీంద్ర సన్యాల్, జోగేష్ చంద్ర ఛటర్జీ, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్ లాంటివారు 'హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్' (HRA) సంస్థను స్థాపించారు. దీన్నే 1928లో చంద్రశేఖర్ ఆజాద్ 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ' (HSRA) గా మార్చాడు. 1926లో భగత్‌సింగ్ 'నవజవాన్ భారత్' సభను స్థాపించాడు.

### విప్లవాలు - విప్లవవాదులు

విప్లవవాదులు ఆంగ్లేయులపై భౌతిక దాడులకు పాల్పడేవారు. 1909లో అభినవ భారత్ సంస్థ సభ్యుడు గణేష్ సావర్కర్‌కు నాసిక్ జడ్జి జాక్సన్ ద్వీపాంతరవాస శిక్ష విధించగా, సంస్థ మరో సభ్యుడు అనంత లక్ష్మణ్ కారేకర్ జాక్సన్‌ను కాల్చి చంపాడు. దీన్నే నాసిక్ కుట్రకేసుగా పేర్కొంటారు. ఈ కేసులో భాగంగానే వి.డి.సావర్కర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించి అండమాన్‌కు పంపారు. ఈయన 'ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్', 'జోసఫ్ మాజినీ జీవిత చరిత్ర' లాంటి గ్రంథాలు రచించారు. 1907 డిసెంబరు 6న బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ ఫుల్లర్‌పై హత్యాయత్నం చేశారు. మెజిస్ట్రేట్ అలెన్ కత్తిపోట్లకు గురయ్యాడు. 1908 ఏప్రిల్ 30న కింగ్స్ ఫోర్డ్‌ను చంపడానికి విప్లవకారులు ప్రయత్నించగా కెనడీ, ఆమె కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి పాల్పడిన ఖుదీరాంబోస్‌ను బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసింది. బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ సర్ ఆండ్రూస్‌పై హత్యాయత్నం చేసిన భూపేంద్ర బోస్‌కు ద్వీపాంతరవాస శిక్ష విధించారు. కలకత్తాలోని మనిక్‌తాలా తోటలో విప్లవకారులు బాంబులు తయారు చేస్తుండగా ప్రభుత్వం 39 మందిని అరెస్ట్ చేసి కేసులు పెట్టింది. దీన్నే కలకత్తా కుట్ర కేసు లేదా అలీపూర్ బాంబు కేసుగా పేర్కొంటారు. ఈ కేసులో ముద్దాయిల తరపున చిత్తరంజన్‌దాస్ వాదించి అరవిందో ఘోష్‌ను నిర్దోషిగా తప్పించాడు. కలకత్తా కుట్ర కేసులో అరవిందోఘోష్, వీరేంద్రకుమార్ ఘోష్, నరేంద్రగోసాయిన్ కనయలాల్‌దత్, ఎస్ఎన్.బోస్ లాంటి వారు ఉన్నారు. కనయలాల్‌దత్, ఎస్ఎన్.బోస్‌లకు ఈ కేసులో ఉరిశిక్ష విధించారు.

విప్లవకారులు ఖుదీరాంబోస్‌ను అరెస్ట్ చేసిన నందాలాల్ అనే పోలీస్ అధికారి (ఇన్‌స్పెక్టర్)ని, ప్రభుత్వ సాక్షిగా మారిన నరేంద్ర గోసాయిన్‌ను, అతడి కేసులో ప్రభుత్వం తరపున వాదించిన అశుతోష్ బిస్వాస్ అనే న్యాయవాదిని కాల్చిచంపారు. పాండిచ్చేరి కేంద్రంగా ఎం.పి.తిరుమల ఆచార్య, వీవీఎస్ అయ్యర్‌లు విప్లవ కార్యకలాపాలు సాగించేవారు. నాటి తిరునల్వేలి మెజిస్ట్రేట్ ఆషీని వాంచి అయ్యర్ హత్యచేయగా అతడిపై తిరునల్వేలి కుట్రకేసు పెట్టి ఉరితీశారు. దిల్లీలో నాటి వైస్రాయ్ రెండో హార్డింజ్‌పై హత్యాయత్నం చేసిన ఉద్యమకారులపై దిల్లీ కుట్రకేసు పెట్టారు. ఈ కేసులో అమర్‌చంద్ ఆనందవిహారీ, బసంత్‌కుమార్ బిస్వాస్, బాల్‌ముకుందలను ఉరి

తీశారు. రెండో హార్డింజ్‌పై బాంబులు వేసిన రాస్ బిహారీబోస్ తప్పించుకుని జపాన్‌కు పారిపోయాడు. అక్కడి నుంచే ఆర్.బి.బోస్ 'ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్'ని స్థాపించి విప్లవ కార్యకలాపాలు కొనసాగించాడు. లాహోర్‌లో గార్డన్ అనే అధికారిపై కూడా బాంబు దాడిచేశాడు. 1915లో సచీంద్ర సన్యాల్, లాలా హరదయాళ్, బాగ్ కర్తార్‌సింగ్ లాంటి విప్లవకారులు యావద్భారత తిరుగుబాటు పథకాన్ని రూపొందించారు. కానీ ఆంగ్ల ప్రభుత్వం దాన్ని విఫలం చేసి బాగ్ కర్తార్‌సింగ్‌ను ఉరితీసింది. 1925లో విప్లవకారులు లక్నో షహరాన్‌పూర్ మార్గంలోని కాకోరి రైల్వేస్టేషన్‌లో రైలుపై దాడి చేశారు. దీనిలో పాల్గొన్న విప్లవకారులపై 1926లో కాకోరి కుట్రకేసును నమోదు చేశారు. ఈ కేసులో రామ్‌ప్రసాద్ బిస్మిల్, రోషన్‌సింగ్ రాజేంద్రలహరి, అష్ఫాఉల్లాఖాన్‌లను ఉరితీశారు. ఈ కేసులోనే మన్మథగుప్తాకు 14 సంవత్సరాల శిక్ష విధించారు. చంద్రశేఖర్ ఆజాద్ తప్పించుకున్నాడు.

## సుభాష్ చంద్రబోస్

గాంధీజీ పిలుపునందుకుని నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత జాతీయోద్యమంలో పాల్గొన్నాడు. 1897 జనవరి 23న బోస్ కటక్‌లో జన్మించాడు. జాతీయోద్యమంలో చిత్తరంజన్‌దాస్ అనుచరుడిగా పేరొందాడు. సీఆర్ దాస్ ఫార్వర్డ్‌బ్లాక్ పత్రికకు సంపాదకుడిగా కూడా పని చేశాడు. 1938 హరిపుర, 1939 త్రిపుర కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షత వహించాడు. 1939 త్రిపుర ఎన్నికల్లో గాంధీ ప్రతిపాదించిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను ఓడించాడు. గాంధీజీ కూడా పట్టాభి ఓటమి నా ఓటమి అని అంగీకరించారు. 1939లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ఫార్వర్డ్‌బ్లాక్ అనే పార్టీని స్థాపించాడు. రెండో ప్రపంచ యుద్ధసమయంలో ఆంగ్ల ప్రభుత్వం బోస్‌ను గృహనిర్బంధంలో ఉంచగా 1941 జనవరి 26న తప్పించుకుని జర్మనీ, జపాన్ దేశాలకు వెళ్లాడు. రాస్ బిహారీ బోస్ స్థాపించిన ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్, కెప్టెన్ మోహన్‌సింగ్ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలను 1942 నాటి బ్యాంకాక్ సమావేశంలో సుభాష్‌చంద్రబోస్‌కు అప్పగించగా బోస్ వాటిని 'ఆజాద్‌హింద్ ఫౌజ్'గా పేర్కొని, 'జైహింద్, చలో ఢిల్లీ' నినాదాలు ఇచ్చాడు. శత్రుదేశాల సహాయంతో ఇంగ్లండ్‌ను ఓడించి భారత దేశానికి స్వాతంత్ర్యం తేవాలని భావించాడు. 1943 అక్టోబరు 21న సింగపూర్‌లో స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని స్థాపించాడు. జపాన్ తొలిసారిగా బోస్ నాయకత్వంలోని భారత్‌ను స్వతంత్ర దేశంగా గుర్తించింది. జపాన్ తాను ఆక్రమించిన అండమాన్, నికోబార్ దీవులను బోస్‌కు అప్పగించింది. వాటికి షహీద్ (అండమాన్), స్వరాజ్య (నికోబార్) దీవులుగా పేరు పెట్టాడు. బోస్ నాయకత్వంలో భారతజాతీయ సైన్యం మౌడక్ (బర్మా), కోహిమా, ఇంఫాల్ ప్రాంతాలను ఆక్రమించుకుంది. కానీ జపాన్ ఓటమితో ఐఎన్ఏకు సహాయం నిలిచిపోయింది. బోస్ బ్యాంకాక్ నుంచి టోక్యోకు వెళ్తూ తైపే/ తైవాన్‌లో 1945 ఆగస్టు 18న విమాన ప్రమాదంలో మరణించారు.

## విదేశాల్లో విప్లవోద్యమాలు

భారతదేశంతో పాటు ఇతర దేశాల నుంచి కూడా భారతీయులు విప్లవోద్యమాలను నడిపారు. అమెరికాలోని కాలిఫోర్నియా కేంద్రంగా లాలా హరదయాళ్ గదర్ పార్టీని స్థాపించి విప్లవ కార్యకలాపాలు చేపట్టాడు. ఆంధ్రుడైన దర్శి చెంచయ్య గదర్‌పార్టీలో చేరాడు. అమెరికా నుంచే రామనాథ్‌పురీ విప్లవోద్యమ ప్రచారానికి సర్క్యులర్ - ఇ - అజాదీ అనే పత్రికను ప్రారంభించాడు. కెనడా నుంచి తారకానాథ్ దాస్ 'ఫ్రీ హిందూస్థాన్' పత్రికను, వాంకోవర్ నుంచి జి.డి.కుమార్ స్వదేశీసేవక్ అనే ప్రతికను, స్వదేశీ సేవక్ హోమ్‌ను నడిపారు. లండన్ కేంద్రంగా శ్యామ్ జీ కృష్ణవర్మ 'ఇండియన్ హోమ్ రూల్ సొసైటీ'ని స్థాపించి 'ఇండియన్ సోషియాలజిస్ట్' పత్రికను నడిపాడు. విదేశాల్లో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తొలి భారతీయ మహిళగా పేరొందిన మేడం బికాజీకామా ఈయన శిష్యురాలే. కామా 1908లో జర్మనీలోని సట్‌గార్డ్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ సమావేశంలో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసింది.

## ఆంగ్లేయులపై దాడులు

పోలీస్ కమిషనర్ ఛార్లెస్ టీగార్డ్‌ను హత్య చేయబోయిన గోపీనాథ్ సాహా అనే విప్లవకారుడు డే అనే అధికారిని హత్యచేశాడు. మదన్‌లాల్ ధింగ్రా అనే విప్లవకారుడు లండన్ వెళ్లి కిర్జన్‌విల్లీ అనే అధికారిని చంపాడు. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమకాలంలో లాహోర్‌లో లాలా లజపతిరాయ్‌పై లాఠీఛార్జి జరిపిన పోలీస్ అధికారి సాండర్స్‌ని భగత్‌సింగ్ కాల్చిచంపాడు. దీన్నే లాహోర్ కుట్ర కేసుగా పేర్కొంటారు. దీంతో 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీశారు. 1929 ఏప్రిల్ 8న కార్మిక వివాదాలు, ప్రజా భద్రతా చట్టం బిల్లులు చర్చిస్తున్న సమయంలో భగత్‌సింగ్, భతుకేశ్వర్ దత్‌లు దిల్లీ శాసనసభపై బాంబులు వేశారు. నాయకులను భయపెట్టే ఉద్దేశంతోనే బాంబులను వ్యక్తులకు దూరంగా వేశారు. ఈ సందర్భంలో 'ఇంక్విలాబ్ జిందాబాద్, సామ్రాజ్యవాదం నశించాలి, అమరజీవులు కావాలన్న కోర్కెలతో మా హృదయాలు నిండిపోయాయి, నా వస్త్రాల్ని కాషాయ రంగుతో తడపండి' అంటూ భగత్‌సింగ్ నినదించాడు. సూర్యసేన్ అనే విప్లవకారుడు 1924లో చిట్టగాంగ్‌లోని రైల్వేస్టేషన్‌పై, 1930లో ఆయుధాగారంపై దాడులు చేయడంతో ఆంగ్లేయులు అతడిని ఉరి తీశారు. జతిన్‌దాస్ అనే విప్లవకారుడు 64 రోజులు జైల్లోనే దీక్ష చేసి 1929లో మరణించాడు. 1931 ఫిబ్రవరి 27న ఆంగ్లేయులు అలహాబాద్‌లోని ఆల్‌ఫ్రెడ్ పార్క్‌లో చంద్రశేఖర్ ఆజాద్‌ను

చుట్టుముట్టగా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. 1922 - 24 మధ్య అల్లూరి సీతారామరాజు మన్యం ప్రాంతంలో రంపా విప్లవంతో ఆంగ్లేయులను భయభ్రాంతులకు గురిచేశారు. 1924 మే 7న జమేదార్ కంచుమీనన్ అల్లూరిని బంధించగా, మేజర్‌గూడాల్ కాల్చి చంపాడు. ప్రతివాద భయంకరాచారి నేతృత్వంలో గోదావరి జిల్లాలో ముస్తాఫా అలీఖాన్, డప్పుల సుబ్బారావులను చంపడానికి ప్రయత్నించగా వారిపై కాకినాడ కుట్రకేసు పెట్టి భయంకరాచారిని అండమాన్‌కు పంపారు. 1940 మార్చి 13న లండన్‌లో సర్దార్ ఉద్దామ్‌సింగ్ మైఖేల్ ఓ డయ్యర్‌ను కాల్చిచంపాడు.

**రచయిత: బొత్స నాగరాజు**

www.eenadupratibha.net